క్లుప్తంగా

శ్రీనగర్ కాలనీ నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని శ్రీనగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా బొద్దుల భానుచందర్, ప్రధాన కార్యదర్శిగా రాకేష్‌సింగ్, గౌరవ అధ్యక్షుడిగా ఉమాపతిగౌడ్, కోశాధికారిగా సాయినాథ్, ఉపాధ్యక్షులుగా రాజేశ్వర్, భూమేశ్, కార్యదర్శులుగా సాయిప్రసాద్, తిరుపతి, ప్రచార కార్యదర్శిగా రాపెల్లి సత్యం, సలహాదారులుగా సూర్యకుమార్, మన్మదరెడ్డి, లోక్ రాంసాగర్ వర్మ, శ్రీనివాస్, శంకర్‌రావు ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారులు రేగుంట రాజేశ్వర్, పెయింట్ ప్రసాద్ కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

శాంతినగర్ కాలనీ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్ హౌసింగ్ బోర్డ్‌కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా జొన్నల మహేష్, ప్రధాన కార్యదర్శిగా రాతి సాయన్న, కోశాధికారిగా వేణు, ఉపాధ్యక్షుడుగా ఈర్షద్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

'గోవుల రవాణాను అడ్డుకోవాలి'

భైంసాటౌన్: గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని హిందూవాహిని మహిషా శాఖ నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం పట్టణ సీఐ ఎల్.శ్రీనుకు వినతిపత్రం అందించారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో గోవధ జరుగకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పట్టణ అధ్యక్షులు చింతపండు మహేశ్, రావుల రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు రానీయం



కాలనీలో పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నిర్మల్‌టౌన్: వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్ కాలనీలో చైర్మన్ తిరుగుతూ పరిసరాలు పరిశీలించి..సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఏఈ హరిభువన్, కౌన్సిలర్, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో చిరువ్యాపారి మృతి



ఇంతిహాజ్‌ఖాన్ మృతదేహం

ముధోల్: మండలంలోని గన్నోరా గ్రామంలో ఆదివారం ఇంతిహాజ్‌ఖాన్ (47) అనే చిరువ్యాపారి గుండెపోటుతో మృతి చెందాడు. భైంసా పట్టణానికి చెందిన ఇంతిహాజ్‌ఖాన్ పండ్లు, ఇతర సామగ్రి అమ్ముకునేందుకు గన్నోరా గ్రామానికి వచ్చారు. ఊరి మధ్యలోకి రాగానే ఆయాసంగా ఉందని చెట్టు కింద కూర్చొని.. అక్కడికక్కడే కుప్పకూలాడు. గమనించిన స్థానికులు అంబులెన్సుకు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని భైంసాకు తరలించి కుటుంబీకులకు సమాచారం అందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వవిద్యార్థులు

మామడ: నిర్మల్‌రూరల్ మండలంలోని మంజులపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆదివారం 2006–07లో పదో తరగతి చదివినవారు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులు సుజాత దేవి, క్రిష్ణవేణి, రమ, వినోద, రఘువీర్, సాయన్న, రవిలను సన్మానించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. వేడుకలో విద్యార్థులు గంగామణి, సాయి, రజిత, రవి తదితరులు పాల్గొన్నారు.

నీటి కష్టాలు తీర్చిన భగీరథుడు సీఎం

- ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్
- ఊరూరా మంచినీళ్ల పండుగ
- శుద్ధజలంపై అవగాహన కల్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం: తాగునీటి కష్టాలను తీర్చిన భగీరథుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని మిషన్ భగీరథ డబ్ల్యూటీపీ వద్ద నిర్వహించిన మంచినీళ్ల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శమని.. ఈ పథకంతో ఇంటింటికీ నల్లా నీటిని అందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని పేర్కొన్నారు. అనంతరం నీటిని శుద్ధి చేయడం, గ్రామాలకు సరఫరా చేసే ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మీ, ఖానాపూర్, దస్తురాబాద్ ఎంపీపీలు మోహిద్, కిషన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేణుగోపాల్, ఆత్మకమిటీ చైర్మన్ సతీశ్, ఏఎంసీ డైరెక్టర్ మంగ, ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్, జన్నారం మండలాల నాయకులు పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది



దస్తురాబాద్: గొడిసీర్యాలలో

లక్ష్మణచాంద: గ్రామాల్లో మంచి నీళ్ల పండుగ ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణచాందలో ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, ఏపీవో ప్రమీల, ఉపసర్పంచ్ శ్రీనివాస్, విక్రమ్‌రాజ్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో మంచినీళ్ల పండుగ ఘనంగా నిర్వహించారు. గొడిసీర్యాలలో భగీరథ నీటిపై మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ తీశారు.

తానూరు: మండల కేంద్రంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పృథ్వీ, సర్పంచ్ విఠల్ మంచినీళ్ల పండుగకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి జలంసింగ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో నీళ్ల పండుగ ర్యాలీ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని గ్రామాల్లో మంచి నీటి ట్యాంకులను అలంకరించి ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సర్పంచ్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ తదితరులున్నారు.

సారంగపూర్: గ్రామాల్లోని మంచినీటి ట్యాంకుల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం నీటిని వదిలే సిబ్బందిని సన్మానించారు. ఎంపీడీఓ సరోజ, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీఓ తిరుపతిరెడ్డి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో మంచినీళ్ల పండుగ నిర్వహించారు. పలు చోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించి ర్యాలీలు తీశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలవ్యాప్తంగా భగీరథ నీటి ట్యాంకులను అలకరించి.. ముగ్గులు వేయించారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్‌ను బామిని(బి) సర్పంచ్ పుష్పల, కార్యదర్శి గంగాజల శాలువాతో సన్మానించారు. నర్సాపూర్ (జి) సర్పంచ్ రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఉప సర్పంచ్ సాయేంవర్, రమేశ్, పోశెట్టి పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలోనే ఇంటింటికీ తాగునీరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: స్వరాష్ట్రంలోనే మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నామని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. పట్టణ శివారులోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన మంచినీళ్ల పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టడంతో మారుమూల గ్రామాలకు సైతం నీరు అందుతోందన్నారు. అంతకుముందు పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యంతో చాలా గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందడం లేదన్నారు. వాటర్ ట్యాంకుల వరకు చేరుతున్న నీరు పైప్‌లైన్ పనుల్లో జాప్యం, లీకేజీల కారణంగా ప్రజలకు చేరడం లేదన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకం అమలులో కొన్ని సమస్యలున్న మాట వాస్తవమేనని.. నీరు అందని గ్రామాలను గుర్తించి నీరందించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, వైస్ చైర్మన్ సుదర్శన్ పటేల్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ఓలాలో బహుమతి అందిస్తున్న సర్పంచ్



ఖానాపూర్ మండలం చందునాయక్ తండాలో



తానూరులో..



సారంగపూర్: జామ్‌లో నీటి ట్యాంకు వద్ద..

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

లోకేశ్వరం: అర్హులు ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఓటరు నమోదు ప్రత్యేకాధికారి నరేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని రాజూర గ్రామంలో ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాలో పేర్లు పరిశీలించారు. జాబితాలో పేర్లు తప్పులుంటే బీఎల్‌వోలను సంప్రదించాలని సూచించారు. వారి వెంట బీఎల్‌వో పద్మ, వీఆర్‌ఏ రాజు ఉన్నారు.

కుంటాల: ఓటరు నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆర్‌ఐ తెలంగి విజయ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెంకూర్, అంబకంటి, అంబకంటి తండాలో కొనసాగుతున్న ఇంటింటా ఓటరు నమోదు సర్వేను పరిశీలించారు. ఈ నెల 20లోగా 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.

నేడు హరితోత్సవం

లక్ష్మణచాంద: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో సోమవారం ఉదయం 9 గంటలకు హరితోత్సవం నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎఫ్ఆర్‌వో నజీర్‌ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. వేడుకకు మండల అధికారులు, గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

'కేసీఆర్‌ను గద్దెదించుదాం'

ముధోల్: అవినీతి పాలనతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్న కేసీఆర్‌ను గద్దె దించుదామని బీజేపీ సీనియర్ నాయకులు మోహన్‌రావుపటేల్ అన్నారు. పల్లెపల్లెకు బీజేపీ– గడపగడపకూ మోహన్‌రావుపటేల్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన ముధోల్‌లో పర్యటించారు. పలు కాలనీల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. వారి వెంట మాజీ ఎంపీపీ సుభాష్‌జాదవ్, సోమేశ్ పటేల్, సంగోళ్ల పోతన్న, జీవన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న పండుగ

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో ఆదివారం భీమన్న పండుగ ఘనంగా నిర్వహించారు. ఉదయం దేవడి ప్రతిమలతో వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భీమన్న సంఘం సభ్యులు బండారి భూమన్న, ఆకుల భోజన్న, ఆకుల భూమేశ్, బండారి మల్లేశ్, సాయన్న, దిలీప్, సాయిబాబా, కొండూర్ రమేశ్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

పర్మిట్‌రూములే బెల్ట్ షాపులు..!

- మద్యం దుకాణాలు తెరిచేవరకు యథేచ్ఛగా అమ్మకాలు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



పై చిత్రంలో కనిపిస్తున్నది భైంసాలోని ఓ మద్యం దుకాణం వద్ద పర్మిట్‌రూం. ఇక్కడ ఉదయం 6 గంటలకే పర్మిట్‌రూం తెరిచి మద్యం విక్రయాలు చేపడుతున్నారు. ఇలా దుకాణం తెరిచే వరకు మద్యం అమ్ముతున్నారు. క్వార్టర్‌కు రూ. 20 నుంచి రూ.30 అధిక ధరకు విక్రయిస్తున్నారు.



భైంసాటౌన్: మద్యం దుకాణాల నిర్వహణలో నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతోంది. టెండర్ ద్వారా మద్యం దుకాణాలు దక్కించుకున్నవారు. గ్రామాల్లో వేలంపాటల ద్వారా బెల్ట్ షాపులు దక్కించుకుని ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు చేపడుతున్నారు. ఎమ్మార్పీ ధర కంటే రూ.20 నుంచి రూ.30 అధిక ధరలకు విక్రయిస్తూ మందుబాబుల జేబులు గుల్ల చేస్తున్నారు. గ్రామాలతోపాటు పట్టణాల్లో సైతం బెల్టుషాపులు బహిరంగంగా కొనసాగుతున్నా.. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో బెల్టు షాపులు ఇష్టారీతిన వెలుస్తుండడంతో యువత, విద్యార్థులు సైతం మద్యానికి అలవాటు పడుతున్నారు. దీంతో మద్యం విచ్చలవిడి అమ్మకాలు నియంత్రించి, ముఖ్యంగా యువత, విద్యార్థులు మత్తుకు అలవాటు పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

పర్మిట్ రూముల్లోనే అమ్మకాలు...

జిల్లావ్యాప్తంగా బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు బహిరంగ రహస్యమే. రూ.లక్షల్లో వేలంపాడి దక్కించుకుని అధిక ధరలకు మద్యం విక్రయించడం తెలిసిందే. అయితే కొందరు మద్యం దుకాణాల నిర్వాహకులు బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయడమే కాక ఒకడుగు ముందుకేసి ఏకంగా పర్మిట్‌రూముల్లోనే మద్యం విక్రయాలు చేపడుతున్నారు. భైంసా పట్టణంలోని కొన్ని మద్యం దుకాణాల వద్ద పర్మిట్‌రూంల్లో ఉదయం ఆరు గంటల నుంచే మద్యం విక్రయిస్తుండటం గమనార్హం. అది కూడా ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ తతంగమంతా బహిరంగంగానే జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

గ్రామాలు, పట్టణాల్లో ఇష్టారీతిన బెల్టుషాపులు వెలుస్తున్నాయి. ఎప్పుడు పడితే అప్పుడు మద్యం లభిస్తుండడంతో మద్యానికి బానిసగా మారే వారి సంఖ్య పెరుగుతోంది. కొందరు మద్యం మత్తులో ఆత్మహత్యలకు పాల్పడిన సందర్భాలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు చేపడుతున్నా.. ఏకంగా పర్మిట్ రూముల్లో సైతం మద్యం దుకాణాలు తెరిచే వరకు విక్రయాలు కొనసాగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

పద్మశాలి పురస్కారం సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: పద్మశాలి ప్రతిభా పురస్కారం –2023కు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కార్యక్రమ నిర్వాహకుడు వాల్గొట్ కిషన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2022–23లో పదోతరగతి, ఇంటర్, ఐఐటీ మెయిన్స్, నీట్, ఎంసెట్‌లలో అత్యధిక మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులంతా అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 94417 28535, 94901 36717 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. ఆదివారం ఆయన నిర్మల్‌లోని మంజులాపూర్ కాలనీలో శక్తి కేంద్రం పోలింగ్ బూత్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, కమ్యూనిస్టు పార్టీలు ఒక్కటై బీజేపీకి వ్యతిరేకంగా పని చేస్తుండటం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తను పోలింగ్ బూత్ కమిటీలో చేర్చి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, లింగం, మగిడి రమేశ్, లింగం శ్రీకాంత్, రాకేష్, రాజు, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాసాయిపేట్‌లో మారెమ్మ బోనాలు



కళాకారుల విన్యాసం

కడెం: మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో ఆదివారం మారెమ్మ బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్ల నడుమ కళాకారుల ఆటపాటలతో ఆలయానికి వెళ్లారు. మట్టి కుండల్లో వండిన బోనాన్ని మారెమ్మకు నైవేద్యంగా సమర్పించారు. పిల్ల, జల్ల, పాడిపంటలను సల్లంగా చూడాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాముగౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఖానాపూర్: రాష్ట్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూతన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో జరిగిన సీపీఎం జీపు జాతలో పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలన్నారు. పేదలకు స్థలాలు ఇవ్వడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. జీవో 58 ప్రకారం ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలన్నారు. ఇందులో భాగంగా ఈనెల 18 నుంచి 27వరకు జీపు జాత కొనసాగిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి గౌతం కృష్ణ, సురేష్, నర్సయ్య, పోషలింగం, మునేశ్వర్, రమేశ్ తదితరులున్నారు.

అటెన్షన్ ప్లీజ్..

బస్‌షెల్టర్ నిర్మించరూ



తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. 61వ జాతీయ రహదారి కావడంతో ఇక్కడి నుంచి మహారాష్ట్ర, తెలంగాణలోని ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికులు అధిక సంఖ్యలో వస్తుంటారు. బస్‌షెల్టర్ లేక కొందరు ప్రయాణికులు ఎండలో, మరికొందరు చెట్ల కింద నిరీక్షిస్తున్నారు. అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

బాసరలో పడవల దగ్ధం..!

భైంసాటౌన్: బాసరలో గోదావరి నది మొదటి ఘాట్ వద్ద మూడు పడవలు అనుమానాస్పద స్థితిలో దగ్ధమయ్యాయి. ఆదివారం గోదావరి నది తీరంలో మూలన పడి ఉన్న రెండు పైడిల్‌బోట్లు, ఒక మిషన్ పడవ పూర్తిగా కాలిపోయాయి. నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి చెందినవిగా స్థానికులు భావిస్తున్నారు. కరెంట్ తీగలు తగిలి ప్రమాదం సంభవించినట్లు అనుమానిస్తున్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు

ఖానాపూర్: మరో అడెల్లిగా పేరొందిన మండలంలోని సింగాపూర్ పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం బీజేపీ నాయకులు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి పూజలు చేశారు. ఏటా పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా మొక్కులు చెల్లించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెంబి ఎంపీపీ దంపతులు కవితగోవింద్‌నాయక్ తదితరులు ఉన్నారు.

శ్రీహరి రావును కలిసిన కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కూచాడి శ్రీహరిరావును మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కటకం భూమారెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు దినేష్, నారాయణరెడ్డి, మహేందర్, శ్రీనివాస్, నితీశ్ తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌కు స్పందన

ఖానాపూర్: ప్రధాని నరేంద్రమోడీ నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన వస్తుందని బీజేపీ నాయకురాలు జానుబాయి అన్నారు. ఆదివారం పట్టణంలో మన్‌కీ బాత్ 102వ ఎపిసోడ్‌ను కార్యకర్తలతో కలిసి వీక్షించారు. డి.మలయ్య, అంకం మహేందర్, సింహరాజుల ఆనంద్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

కుంటాలలో..

కుంటాల: ప్రధానమంత్రి నరేంద్రమోడీ మన్‌కీ బాత్ 102వ ఎపిసోడ్‌ను ఆదివారం ఉదయం బీజేపీ శ్రేణులు టీవీల్లో వీక్షించారు. ఎంపీపీ ఆప్క గజ్జారాంయాదవ్, బీజేపీ మండల కన్వీనర్ గుడ్డేటి నర్సయ్య, ఎంపీటీసీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ

ముధోల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భైంసాలో హరితోత్సవంపై నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో రబీంద్ర హైస్కూల్ విద్యార్థులు పి.స్పందన, సౌజన్య, తేజస్వి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

జాన్సన్‌నాయక్ పర్యటన

దస్తురాబాద్: మండలంలోని భూత్కూర్, మున్యాల, గోడిసీర్యాల, రాంపూర్, దస్తురాబాద్, దేవునిగూడెం, రేవోజీపేట గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్ సుడిగాలి పర్యటన చేశారు. గొడిసీర్యాల గోండుగూడలో ఆయన ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

సన్మానం

కుంటాల: కుంటాలకు చెందిన నారాయణ కుభీర్ మండలంలో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ సేవలకు గాను మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా వారు ప్రశంసాపత్రం అందుకున్నారు. తోటి ఉద్యోగులు, నాయకులు ఆదివారం ఆయనను కుంటాలలో సన్మానించారు.